క్లుప్తంగా

బడి మానేసిన పిల్లలను గుర్తించండి



మాట్లాడుతున్న ఏఎంసీ మహేంద్రరెడ్డి

తనకల్లు: వివిధ కారణాలతో బడిని మధ్యలోనే మానివేసిన పిల్లలను గుర్తించాలని సమగ్ర శిక్ష ఏఎంసీ మహేంద్రరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6–14 ఏళ్లలోపు బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండేలా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యా ప్రవేశం, దీక్షా రిజిస్టర్, స్పీకాస్ రిజిస్ట్రేషన్, ఓఎస్‌సీ విద్యార్థుల సమీక్ష, విద్యార్థుల కిట్ల గురించి సమగ్రంగా తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు లలితమ్మ, కళ్యాణీ, హెచ్ఎంలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

గాండ్లపెంట: కటారుపల్లి గొల్లపల్లి గ్రామానికి చెందిన వేణుగోపాల్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 15 మద్యం బాటిళ్లు (క్వార్టర్) స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ క్రిష్ణవేణి గురువారం తెలిపారు. ఇంటి వద్ద అమ్ముతున్నాడన్న ఆంధ్ర మద్యం సమాచారం మేరకు దాడులు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో హెచ్‌సీ తిరుమలరెడ్డి, కానిస్టేబుల్ భాస్కర్ పాల్గొన్నారు.

విద్యావైజ్ఞానిక తరగతులు జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్‌నాయకులు

పుట్టపర్తి టౌన్: జూలై 8,9,10, తేదీల్లో కాకినాడలో తలపెట్టిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక తరగతులు జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బాబు కోరారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యావ్యవస్థలో అవినీతి, అక్రమాలను వెలికి తీయడంతో పాటు విద్యార్థుల్లో రాజకీయ అవగాహన పెంపొందించేందుకు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్, చంద్రశేఖర్ రెడ్డి, సీపీఐ నేత వేమయ్యయాదవ్, అరుణ్‌రెడ్డి, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా నిలుస్తాం



వైఎస్సార్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా నిలుస్తామని ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ మైలారప్ప గోవిందరెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం చెన్నేకొత్తపల్లి న్యామద్దెల సర్కిల్‌లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎంపీపీ చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల తరువాత తిరిగి అందరినీ కలిసిందుకు సంతోషంగా ఉందన్నారు. ఇకపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. గ్రామాల్లో అధికార పార్టీ వారి నుంచి సమస్యలు ఎదురైతే వాటికి భయపడకుండా అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డాక్టర్ ఉదయ్‌పై చర్యలు తీసుకోండి

చెన్నేకొత్తపల్లి: ఏఎన్ఎంలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ.. మెసేజ్‌లు పంపుతున్న ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీ డాక్టర్ ఉదయ్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుజ్జల సురేష్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా డాక్టర్ ఉదయ్ ఎక్కడ పని చేసినా కింది స్థాయి సిబ్బందితో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ విషయాన్ని చాలా మంది మహిళా ఉద్యోగులు బయటకు చెప్పలేక మానసికంగా కుంగిపోతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వారితో డాక్టర్ వృత్తికే కళంకం వస్తోందన్నారు. విచారణకు నియమింపబడిన సభ్యులు నిష్పక్షపాతంగా విచారణ చేయాలని కోరారు. బాధితులకు న్యాయం జరగక పోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామన్నారు.

చేపల చెరువు వేలం వాయిదా

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి మున్సిపాలిటీలోని ఎనుములపల్లి, సాహెబ్ చెరువుల వేలం పాట వాయిదా పడినట్లు కమిషనర్ అంజయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరగాల్సిన వేలం పాటకు సభ్యులు నామమాత్రంగా రావడంతో వాయిదా వేసినట్లు చెప్పారు. తదుపరి వేలం పాట ఎప్పుడనేది త్వరలో తెలియజేస్తామన్నారు.

బీసీజీ టీకాతో క్షయ నివారణ



రెడ్డిపల్లిలో టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది



తాడిమర్రిలో వృద్ధురాలికి టీకా వేస్తున్న దృశ్యం

నల్లమాడ: బీసీజీ టీకాతో క్షయ నివారణ సాధ్యమని మండల వైద్యాధికారి డాక్టర్ గణేనాయక్ పేర్కొన్నారు. రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి సోమ, గురువారాల్లో 60 ఏళ్లు పైబడిన వారికి, అలాగే 18 ఏళ్లు పైబడిన షుగర్ వ్యాధిగ్రస్తులు, పొగ తాగేవారికి, మందు (ఆల్కాహాల్) సేవించే వారికి క్షయ సోకకుండా ముందుజాగ్రత్తగా బీసీజీ టీకాలు వేస్తున్నామన్నారు. గురువారం మండలంలోని 485 మందికి టీకాలు వేసినట్లు తెలిపారు. అవసరమైన వారు టీకాలు వేయించుకొని క్షయ నిర్మూలనకు సహకరించాలని కోరారు.

తాడిమర్రి: బీసీజీ టీకాతో క్షయను పూర్తిగా నిర్మూలించ వచ్చునని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. గురువారం తాడిమర్రి, ఎం.అగ్రహారం, కునుకుంట్ల, దాడితోట, నార్శింపల్లి, పెద్దకోట్ల, పిన్నదరి, చిన్నచిగుళ్లరేవు, చిల్లవారిపల్లి తదితర గ్రామాల్లోని ఏఎన్ఎంలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఇంటింటా తిరుగుతూ



మంగళమడకలో టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

క్షయ వ్యాధి గ్రస్తులు, వారి కుటుంబ సభ్యులు, వృద్ధులు, షుగర్, బీపీ తదితర ధీర్ఘకాలిక జబ్బులు ఉన్న వారికి బీసీజీ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ టీకాలు వేసుకోవడంతో క్షయ ఉన్నవారికి నయం అవుతుందన్నారు. కుటుంబ సభ్యులు, వారితో సన్నిహితంగా ఉండేవారికి రాకుండా నివారిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు కోమలి, కృష్ణమ్మ, సుగుణ, నాగలక్ష్మమ్మ, లక్ష్మీకాంతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండలంలోని మంగళమడక గ్రామంలో వైద్య సిబ్బంది గురువారం క్షయ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీజీ టీకాతో క్షయను పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. క్షయ బాధితులతో పాటు దీర్ఘకాలిక రోగాలున్నవారు, 60 ఏళ్లు పైబడిన వారు బీసీజీ టీకా వేయించుకోవాలని సూచించారు. అనంతరం వారు ముదిగుబ్బ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో డయేరియా నివారణ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లక్ష్మీదేవి, ఎంఎల్‌హెచ్‌పీ విజయకుమారి, ఆశా కార్యకర్త నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటల సాగుపై రైతులకు శిక్షణ

గాండ్లపెంట: రెక్కమాను రైతు భరోసా కేంద్రంలో గురువారం ఖరీఫ్ పంటల సాగుకు సన్నద్ధం అవుతున్న రైతులకు పంటల సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్సీ ఏడీఏ సనావుల్లా, డీఆర్సీ ఏఓ అబ్దుల్‌అలీ వరి, వేరుశనగ, సాగు విధానం, కలుపు, ఎరువుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వరి సాగు చేసిన 15–18 రోజుల అనంతరం కలుపు మందు స్ప్రే చేయాలని, వరి పంటను ఆశించే సుడిదోమ నివారణకు పెక్సిలాన్ 110 ఎంల్ పంటపై పిచికారీ చేయాలని సూచించారు. కందిలో ఎల్‌ఆర్‌జీ–52 రకాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. డ్రోన్ ద్వారా పురుగు మందు వినియోగిస్తే నీరు ఆదా అవుతుందని తెలియజేశారు. వేరుశనగలో అంతర పంటగా ఆముదం, కంది 5:1 నిష్పత్తిలో వేస్తే రైతులు మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. తెగుళ్ల నివారణకు పురుగు మందుల



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శివప్ప, సుధాకర్, ఏఓ లక్ష్మీప్రియ, వీఏఏ, వీఎస్ఏలు, రైతులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ

బత్తలపల్లి: స్థానిక భారతి మండల సమాఖ్య కార్యాలయంలో ఆహారం, పోషణ, ఆరోగ్యం, పారిశుద్ధ్యం(ఎఫ్ఎన్‌హెచ్‌డబ్ల్యూ)పై గ్రామైక్య సంఘం ఆరోగ్య సబ్ కమిటీ సభ్యులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా మానవవనరుల అభివృద్ధి యాంకర్ పర్సన్ లలిత, ఏపీఎం సుదర్శన్‌రాజు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలి, పోషణ తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ రామేశ్వరరెడ్డి, సీసీలు,



మాట్లాడుతున్న ఏరియా కోఆర్డినేటర్ రామేశ్వర్‌రెడ్డి

గ్రామ సంఘం హెల్త్ సబ్ కమిటీ సభ్యులు, మండల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలి



మామిళ్లపల్లి నాలుగు రోడ్ల కూడలిలో విద్యార్థుల మానవహారం

కనగానపల్లి: విద్యాహక్కు చట్టం ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాల్లోపు బడిఈడు పిల్లలంతా తప్పనిసరిగా బడిలోనే ఉండాలని ఎంఈఓ అరుణమ్మ తెలిపారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అలాగే మామిళ్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులు ర్యాలీ చేసి నాలుగు రోడ్ల కూడలిలో మానహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యాహక్కు చట్టం, బడిఈడు పిల్లల గుర్తింపు, ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా ప్రోత్సాహకాలు అంశాలపై విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 శ్రీదేవి, కేజీబీవీ ఎస్ఓ నరసమ్మ, మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ నారాయణ, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, స్నేహలత, పీడీ రమేష్, పీఈటీ శివారెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



నరసింహులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని యాదవవీధికి చెందిన నరసింహులు గురువారం కడుపునొప్పి తాళలేక ఇంటిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు నరసింహులును స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడని నొప్పి భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



తాగునీటి ట్యాంక్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ ఆదినారాయణ ప్రజలకు సూచించారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని డ్రైనేజీలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయరాదన్నారు. మండల కేంద్రంలో తాగునీటి సమస్య తలెత్తకుండా దొరిగిల్లు రోడ్డులోని సత్యసాయి ప్రాజెక్ట్ నీటి సంపుతో పాటు ముదిగుబ్బ గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే ప్రాజెక్ట్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు శివప్రసాద్‌రెడ్డి, మల్లికార్జునప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

రొళ్ల: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మడకశిర సెబ్ సీఐ ఎస్.ధీరజ్‌రెడ్డి సీజ్ చేశారు. రొళ్ల మండలం హెచ్ఎం పల్లికి చెందిన ఓవ్యక్తి, మడకశిర మండలం గోవిందాపురం గొల్లహట్టికి చెందిన ఇద్దరు వ్యక్తులు రెండు ట్రాక్టర్లలో ఇసుకను రొళ్ల వైపు తరలిస్తుండగా తనిఖీ చేసినట్లు సీఐ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.





పచ్చని ప్రయాణం

వర్షాకాలం మొదలవడంతో ప్రకృతి పచ్చదనంతో కళకళలాడుతోంది. ఎటుచూసినా పచ్చని చెట్లు, పచ్చికలు మనసును ఆహ్లాదపరుస్తున్నాయి. చెట్లు గుబురుగా పెరిగి నీడతోపాటు చల్లటి గాలిని అందిస్తున్నాయి. ఇక రహదారుల వెంట ఉన్న చెట్లు మంచి ప్రయాణ అనుభూతిని పంచుతున్నాయి. ధర్మవరం నుంచి బత్తలపల్లి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా పరుచుకున్న పచ్చదనంతో వాహనదారులు ఆహ్లాదకర ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



గోవుల అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి

పుట్టపర్తి టౌన్: గోహింస, గోవుల అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూ పరిషత్ నాయకులు ఎస్పీ మాధవరెడ్డిని కోరారు. గురువారం పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గోరంట్లలో విచ్చలవిడిగా గోమాంసం విక్రయాలు, గోవధ శాలలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి వారం గోరంట్ల పశువుల సంత నుంచి సరిహద్దు రాష్ట్రాలైన కర్ణాటక, కేరళ, తమిళనాడుకు పెద్ద పెద్ద వాహనాల ద్వారా వందల సంఖ్యలో పశువులను ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నారన్నారు. ఎక్కువ సంఖ్యలో పశువులను వాహనంలో తరలించడంలో కొన్ని పశువులు ఊపిరాడక మరణిస్తున్నాయన్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. స్పందించిన ఎస్పీ గోరంట్ల సీఐ ఫోన్ చేసి వెంటనే గోవుల అక్రమ రవాణా, గోవధ శాలలపై



ఎస్పీ మాధవరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు భాస్కర్‌నాయుడు, హరినాథ్‌రెడ్డి, దేవరాజ్, వేణుగోపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మంజునాథ్, సూరి, ఆదిశేషు, రుద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

చెన్నేకొత్తపల్లి: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దాలని మండల విద్యాశాఖ అధికారులు సూచించారు. చెన్నేకొత్తపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో బుధవారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మున్వర్‌బాషా, ప్రసన్న కుమార్ నాయుడు మాట్లాడుతూ.. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో గ్రామాల్లోని బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నేను బడికి పోతా, విద్యార్థులకు అందించే కిట్లు, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు శాతం, మరుగుదొడ్ల ఫొటోలు. మధ్యాహ్న భోజనం నాణ్యత,



మాట్లాడుతున్న ఎంఈఓ–2 ప్రసన్న కుమార్ నాయుడు

తదితర అంశాలపై చర్చించారు. వీటిపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులతో పాటు ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

తనకల్లు: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం, కౌలురైతుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారంస్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శోభ సువర్ణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద వెంటనే రూ. 20 వేలును బ్యాంకులో జమ చేయాలన్నారు. కౌలు రైతులకు సాగు సాయం కింద ఎకరాకు రూ. 15 వేలు అందజేయాలన్నారు. అలాగే ఖరీఫ్‌లో రైతులందరికీ రాయితీ విత్తన వేరుశనగను పంపిణీ చేయాలన్నారు. బ్యాంకుల్లో రుణాలను రూ. 2 లక్షల వరకు మాఫీ చేసి రైతులను ఆదుకోవాలన్నారు. 50 ఏళ్లు పైబడిన రైతులకు నెలకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డెప్ప, చౌడప్పయాదవ్, కరీముల్లా బాషా, రైతులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

గాండ్లపెంట: సోమయాజులపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సూపర్‌వైజర్ జయమ్మ ఆధ్వర్యంలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్ల వయసున్న పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం ద్వారా అర్హులైన పిల్లలను కేంద్రంలో పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య ప్రాముఖ్యత, పౌష్టికాహారం ఆవశ్యకతపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఈశ్వరమ్మ, అంజనమ్మ, చంద్రకళ, భాగ్యమ్మ, పుష్ప, పార్వతి పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

జగనన్న హయాంలోనే విద్యాభివృద్ధి

చిలమత్తూరు: విద్యారంగంలో నూతన సంస్కరణలు తీసుకువచ్చి విద్యావ్యవస్థను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టిన ఘనత వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని దేమకేతేపల్లి సర్పంచ్ ఈడిగ తిరుమలేష్ అన్నారు. దేమకేతేపల్లి పంచాయతీ ఓబుళాపురంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాన్ని బెంగళూరు నగరానికి చెందిన పుష్పాంజలిరెడ్డి సొంత నిధులు వెచ్చించి మరమ్మత్తులు చేయించగా ఆమెతో కలిసి గురువారం ఆయన స్కూల్ భవనాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పించి కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారన్నారు. అనంతరం గ్రామస్తులు పుష్పాంజలిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, వార్డు సభ్యురాలు జయమ్మ, పాఠశాల కమిటీ చైర్మన్ హేమలత, గ్రామ పెద్దలు శంకరప్ప, నరసింహప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ తిరుమలేష్, పుష్పాంజలిరెడ్డి

మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచండి

మడకశిర: మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన గురువారం జరిగిన మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అక్రమ లే ఔట్లను క్రమబద్ధీకరించి ఆదాయాన్ని పెంచాలని కోరారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై శ్రద్ధ చూపాలని ఆదేశించారు. కౌన్సిలర్లు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కమిషనర్ రంగస్వామి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నూతన బస్సు ప్రారంభం:
విజయవాడ–మడకశిర ఆర్టీసీ సర్వీస్‌ను స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, అధికారులు పాల్గొన్నారు. అనంతరం యాదవ కల్యాణ మంటపంలో నియోజకవర్గంలోని వార్డు, గ్రామ సచివాలయాల సిబ్బందితో ఎమ్మెల్యే సమావేశమై 1న జరగనున్న పింఛన్ల పంపిణీపై సమీక్షించారు. అనంతరం మడకశిరల ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమీక్షించారు. అనంతరం పట్టణంలో వారపు సంతను ఎమ్మెల్యే పరిశీలించారు. అధిక సుంకం వసూలు చేస్తున్నారని వ్యాపారులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు.

మతస్వేచ్ఛ హక్కును పరిరక్షించుకోవాలి

హిందూపురం టౌన్: దేశంలో మత స్వేచ్ఛ హక్కును పరిరక్షించాలని వివిధ చర్చిల పాస్టర్లు, నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని సీఅండ్ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చిలో గురువారం ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ 28వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కొన్ని మతోన్మాద శక్తుల వల్ల దేశంలో క్రైస్తవులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అలాంటి చర్యలు మత స్వేచ్ఛ హక్కును కాలరాసేలా ఉన్నాయన్నారు. మణిపూర్ విధ్వంసకాండ లాంటి ఘటనలు దేశంలో పునరావృత్తం కాకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ మూడవ పేరాను రద్దు చేయాలని, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, హిందూపురం పాస్టర్ ఫెలోషిప్స్ పెద్దలు సూర్యప్రకాష్, సంఘం పాస్టర్ స్టీఫెన్ రాజ్, పెద్దలు సాల్మన్ రాజ్, దేవరాజు, అరుణ్ కుమార్, జార్జి బాబు, జిల్లా యూత్ కమిటీ సభ్యులు డేనియల్, ప్రభుదాస్, అబ్రహం పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో పాల్గొన్న పాస్టర్లు